

# పతివ్రత

## - సింహప్రసాద్

"అన్నపూర్ణమ్మగారు పోయార్ట."

అప్పటికింకా తూరుపు తెల్లగా తెల్లవారలేదుగాని అన్నపూర్ణమ్మగారి బ్రతుకు తెల్లవారిపోయిందన్న వార్త ఆవూరి పొలిమేరలు దాటేసింది క్షణాల్లో.

అంతా కొన్ని నిమిషాలపాటు శిలాప్రతిమలై పోయారు.

"నిజమా? ఎర్రగా దబ్బపండురంగులో కళకళ లాడుతూవుండే అన్నపూర్ణమ్మగారు పసుపురాసిన మొఖాన ఇంత కుంకుమ బొట్టుతో తలంటుకున్న జుట్టునిండా పూలు తురుముకుని ప్రసన్నంగా మంగళకరంగా అప్పుడే పూజచేసో లేక చేస్తూనో వుండే అన్నపూర్ణమ్మగారు-తీపసాదలయెన వాత్సల్యానుగారాలు కురిపించే అన్నపూర్ణమ్మగారు-చూడగానే చెయ్యెత్తి నమస్కరించాలన్పించే చెయ్యెత్తు మనిషి అన్నపూర్ణమ్మగారు-నిజంగా చనిపోయారా?" అనుకున్నారు. అనుకుని కళవళ పడ్డారు. కన్నీరు కార్చారు.

అన్నపూర్ణమ్మ తల్లి నిజంగా మహాలక్ష్మే!"

"ఆ యమ్మ దేవతనుకో. ఏజన్మలోనో చీమతలకాయంత పాపంచేసి ఈ పుటుకపుట్టి ఆఇంటికి మెట్టిందిగాని అసలు మనిషిగా పుట్టాల్సినమ్మకాదు"

"ఆ చల్లన్తల్లి మొఖవేం చూడాల, ఆ తల్లి ఎముకల్లేని చేతినే చూడాల.

"ఓర్పుకి మంచికి ఆ తల్లినే చెప్పుకోవాలి, భూదేవినే చెప్పుకోవాలి"

ఆ వూళ్ళోనూ ఎన్నో పార్టీలూ ముఠాలూ కక్షలూ కార్పణ్యాలూ అసూయలూ ఆడంబరాలూ అన్నీ వున్నాయ్. అయినా అన్నపూర్ణమ్మగారి విషయంలో అంతా ఒక్కటై పోయారు. "ఆవిడ మహా ఇల్లాల్లే" అని మగాళ్ళంతా అంటే, "సీతాసావిత్రిలాంటి పతివ్రతావిడ" అన్నారు ముక్తకంఠంతో ఆడవాళ్ళు.

విశేష మేమిటంటే అన్నపూర్ణమ్మగారు ఆవూరికెల్లా ధనికుడూ పెద్ద భూస్వామి అయిన రాజశేఖరంగారి భార్యే అయినా ఆయన పేరెవ్వరూ ఎత్తుకోవడంలేదు. అలా అని మరచి పోయారనీ కాదుగాని ఇష్ట

పూర్వకంగానే ఆయన ప్రసక్తి వదిలేస్తున్నారంతా!

ఊరు ఊరంతా రాజశేఖరంగారి మేడ ముందుకొచ్చి నిలిచింది వార్త తెలిసిన కొంచెం సేపటికే.

అన్నపూర్ణమ్మగారి శవాన్ని పట్టుబట్టతో కప్పారు. పూలు జిమ్మారు. ప్రక్కన అగరువత్తులు వెలిగించారు. జీవకళలేని అమ్మవార్లా వెలిగిపోతోంది శవం.

ఒకనాడు తేజస్సుతో చిరునవ్వులకాంతితో వెలిగిపోయిన శరీరం ఈనా డిలా కట్టెలా కటికనేలమీద పడి వుందంటే జీవితాలు నీటి బుడగల్లా క్షణభంగురాలు సుమా అని శ్మశానవైరాగ్యం అభినయించారు. ఆ వెంటనే ఆవిడ మొఖం నల్లగా-మరీ ఇదిగా వుండటంచూసి ఆశ్చర్యపోయారు,

"సహజ మరణమే నంటావా?" అని అనుమాన పడ్డారు గాని పైకి అన సాహసించలేక ఆ ఇంటి పని మనిషీ పై పెచ్చు అన్నపూర్ణమ్మగారెంతో ఇష్టపడే వ్యక్తీ అయిన రాజమ్మవైపు చూశారు. ఆమె గోలగా ఏడుస్తూంది వుంటే తమది ఒట్టి అనుమానమే అని కొట్టేసుకునే వారేమోగాని ఆమె శవం ప్రక్కనే మౌనంగా విషాదంగా కూర్చుని శవం మొహంలోకి దీక్షగా చూస్తూండటంతో "అలా అనుమానించడానికి ఆస్కారం లేక పోలేదులే" అనుకున్నారు. అన్నపూర్ణమ్మ గారి గురించిన కబుర్లలో పడ్డారు. ఆవిడ గుణగణాల్నీ మంచితనాన్నీ పొగిడారు. ఆమె పతిసేవగురించీ ఓర్పు సహనాల గురించీ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆమె గూర్చి తమకు తెలిసిన సంఘటనలను మళ్ళీ మళ్ళీ చెప్పుకున్నారు. ముక్కులు పైట కొంగుతో తుడుచుకున్నారు.

కాని అప్పుడప్పుడూ వాళ్ళ దృష్టి మేడ మెట్లుమీంచి పైకెళ్ళి దిగివచ్చేస్తున్నాయ్ నిరాశగా.

రాజశేఖరంగారి వంశస్తులైన ఓ వలుగురు పెద్దలు ఓ నిర్ణయానికొచ్చి మెల్లగా మేడమెట్ల పై వెళ్ళారు. అంతా తమవంకే చూస్తున్నారని తెలుస్తోన్న, ఏం జరుగుతుందో అన్న ఆ ధైర్యం, కూకలేస్తాడేమోనన్న భయం, వెనక్కి బలవంతంగా లాగుతున్నా ఇది పరువు ప్రతిష్ఠల సమస్య గనుక వంశ మర్యాదల విషయం గనుక భారంగా ముందుకు అడుగులేస్తున్నారు భారం దేవుడి మీదవేసి.

మేడమీద గది ముందాగారు.

లోపల్నుంచేం శబ్దాలు వినరావడంలేదు.

"ఇంకా మేలుకోలేదన్నమాట..." అనుకుంటూ సంశయంగానే సన్నగా తలుపు తట్టాడాయన. కొన్ని నిముషాలు గడిచినా లోపల్నుంచి రెస్పాన్స్ రాలేదు. కొంచెం ధైర్యం కూడదీసుకుని మళ్ళీ తట్టారు.

"వూఁ... ఎవరూ?..."

రాజశేఖరంగారు పలికారు మత్తుగా మరో లోకంనుంచి.

"మే-రా అబ్బాయ్"

"వూఁ ???"

ఆయనికి కొంచెంగా మెలకువ వచ్చింది. బలవంతంగా కళ్ళు తెరిచారు.

ప్రక్కనే మైమరచి పడుకునుంది నగ్నంగా లాసీ అనే పేరుతో చెలామణీ అవుతోన్న శ్యామల.

ఆయన దృష్టి ఆమె మొహంమీదలేదు. తామర మొగ్గల్లాంటి కళ్ళమీదలేదు. నున్నని ఎర్రటి ఆమె శరీరం మీదుంది. పరచిన వెన్నెల్లాంటి యౌవన పొంగులమీదుంది.

కసిగా కొరికెయ్యాలన్పించే ఆపిల్ పళ్ళ లాటి ఆమె చెక్కిళ్ళ మీదుంది.

అర్థ నిమిలిత నేత్రాలతో ఆమె అందాల్ని యౌవనశోభనీ త్రాగినంతత్రాగి మత్తుగా మెత్తగావున్న ఆమె శరీరాన్ని గుండెలకు హత్తుకున్నారు. వేడిముద్దులతో ఆమె అణు వణువునీ నింపేశారు.

లూసీ అంటే ఆయనకెంతో ఇష్టం. ఎంత ఇష్టమంటే ఆయన ఇన్నాళ్ళు ఎప్పుడూ ఒక్క ఆడదానితో వుండలేదు బట్టల్ని మార్చి నట్లుగా ఆడవాళ్ళని మార్చేస్తుంటారు. కాని లూసీని మార్చలేకపోయారు. ఆమె శరీర వంపుల ఆకర్షణనుంచి తప్పించుకోలేక పోయారు. అసలు మొదటగా ఆమెని చూసి నప్పుడే చిత్తై పోయారు. హార్స్ రేసెస్ గురించి హైదరాబాద్ వెళ్ళినప్పుడు ఓ ఖరీదైన హోటల్లో పరిచయమయ్యిందామె. వెంటనే అన్నారు తనతో రమ్మని. రానంది. డబ్బు జిమ్మారు, కుక్కలా వచ్చేసింది. ఎన్నాళ్ళుంటుందంటే, ఆవిడ ఆకర్షణ తగ్గే వరకూ! అంతకంటే మంచి అందం అందే వరకూ.

మళ్ళీ తలుపు చప్పుడవడంతో కోపంగా "ఎవరూ" అని అరిచి లుంగీ చుట్టబెట్టు కుంటూ కోపంగా వెళ్ళి తలుపు తీశారు. పెద్దల్ని చూడగానే తడబడి తానే బయటి కెళ్ళి తలుపులు దగ్గరకు జేరేశారు.

"ఏం బాబాయ్"

కొన్ని క్షణాలెవ్వరూ మాట్లాడలేదు.

తనంటే వాళ్ళంతా ఎంతో గౌరవిస్తారని ఆయనకు తెలుసు. అందుక్కారణం తన ఆస్తీ అంతస్తూ అనీ తెలుసు. అయినా మరీ ఇంత ప్రొద్దుటే వచ్చి ఇంత ఇదవ్వా ల్సిన విషయమేమిటబ్బా అని సతమతమవు తోంటే పెద్దల్లోకెల్ల పెద్దాయనన్నాడు.

"ప్రొద్దుటే పాడుమాట నీకు చెప్పాల్సొ చ్చినందుకు బాధగా వుందిరా"

"ఏం జరిగింది బాబాయ్" రాజశేఖరం గారు కొంచెం అసహనంగానే అన్నారు. ఆయనకెప్పుడెళ్ళి మళ్ళీ లూసీ వెచ్చని కౌగిట్లో ఒరిగిపోదామా అని వుత్కంఠగా వుంది.

"గుండె రాయిచేసుకోవాల్రా-అన్నపూర్ణ పోయింది...

"అన్నపూర్ణా?"

"అవును బాబూ - కోడలే-నిన్నటిదాకా పూజాపునస్కారాల్లో మునిగి తేలిందేమరి. ఇంతలో దేవుడికి కన్నుకుట్టి..."

కొన్ని క్షణాలయ్యాక "ఇప్పుడే వస్తాను ఇంతలో మీరు మిగిలిన ఏర్పాట్లు చూడండి బాబాయ్" అని బాధగా అని లోపలికెళ్ళి పంచెకట్టుకుని శాలువాకప్పుకుని భారంగా మెట్లు దిగారు పెద్దమనిషి తరహాగా.

ఆయన్ని ఆయన విషాద వదనాన్ని చూసి అంతా విస్తుబోయారు. విలాసపురు షుడూ పైలాపచ్చీసు మనిషీ అయిన ఆయనిలా - ఇలా ప్రవర్తిస్తారనె వరూ వూహించలేకపోయారు. అలా అని కళ్ళతో చూస్తోన్నది భ్రమనీ అనుకుని సంతృప్తి పడనూలేదు.

"దేవతలాటి పెళ్ళాం పోతే ఎలాటివారి మనస్సు మాత్రం కరగదులే. మళ్ళీ అలాటి పెళ్ళాం ఎన్నిజన్మలెత్తినా వస్తుందా?" అనుకున్నారు.

తనేమన్నా ఏం చెప్పినా ఎలా ప్రవర్తిం చినాయాఖంగా ఇంటికే ఆడవాళ్ళని తీసు

కొచ్చేసి వాళ్ళతో రేయింబవళ్ళు గడిపినా ఒక్కనాడూ నోరెత్తి అడగని భార్య - తన కోసం తన ఆరోగ్యంకోసం తనక్షేమం కోసం నిత్యం భగవంతుడ్ని ప్రార్థించే భార్య-తనింటి పరువుని తనభుజస్కందాలపై వుంచుకుని కంటికి రెప్పలా కాపాడిన భార్య-నిర్జీవంగా కట్టెలా పడి వుండటం చూసేసరికి దుఃఖం గుండెల్లోంచి తొలుచుకొచ్చింది రాజశేఖరంగారికి. ఆమెకి తీరని అన్యాయం చేశానేమోనన్న భావం లీలగా కదలకపోలేదు కూడా.

ఆయన్నలా చూసి అంతా కళ్ళు తుడుచుకున్నారు కళ్ళతోనే ఓదార్చారు.

కాని రాజమ్మ ఆయన్ని అసహ్యంగా చూసింది.విషప్పురుగుని చూసినట్టు చూసింది. కాటేసి జాలిగా చూస్తూ నిలబడ్డ పాముని చూసినట్టు చూసింది. ఆ ఇల్లాల్ని ఒక్కనాడూ సుఖపెట్టని అతడ్ని తిట్టిపోసింది మనస్సులోనే. ఆయమ్మ గనుక అన్నీ సహించిందిగాని మరొకళ్ళయితే లేచిపోయి వుందురనుకుంది అలా అనుకుందో లేదో ఒకనాటి తమ సంభాషణ గుర్తుకొచ్చింది.

మేడమీద ఒకమ్మాయితో రాజశేఖరంగారు పగలబడి నవ్వుతోంటే వినలేక వంటింట్లోకెళ్ళి అన్నపూర్ణగారు కళ్ళు తుడుచుకొంటోంటే రాజమ్మ అంది.

"అమ్మగారూ-నేనోమాట సెప్పనా"

"ఏవిటే" కళ్ళు గబగబా తుడిచేసుకుంటూ అందావిడ.

"ఇదే మావోళ్ళయితే తెల్లారేసరికి మొగుడ్ని డిచీసి మరోడ్ని కట్టుకునేవోరు. నాను మట్టుకు రేత్రీపొగులూ తాగి తన్నుతాదన్చెప్పి సీతాలుగాడ్ని డిచీసి నరసిగాడ్ని మారుమనువాళ్ళేదా అమ్మగారూ, సుకం సంతోషం చూడని మొగుడితో కాపురం చేస్తేనేం చెయ్యాక పోతేనేం!"

"నువ్వన్నది నిజమే రాజమ్మా. కాని మీకున్న తెగువ, ధైర్యం మాకుండవ్. మాలో చిన్నప్పట్నుంచీ నూరిపోసిన సతీ సుమతుల కథలే సుళ్ళు తిరుగుతుంటాయ్. గడప దాటడానికి మా రక్తం ఒప్పుకోదు. ఒకవేళ ఒప్పుకున్నా ఇటు మెట్టినింటివాళ్ళూ అటు కన్నవాళ్ళూ ఎవ్వరూ ఆదరించరు. ఒక ఆడబిడ్డ సుఖంకన్నా పరువులూ కులాలూ వాళ్ళకిముఖ్యం. అయినా ఇక్కడ ఈ మానసికక్షోభ-ఈ నరకం అనుభవించలేక తెగించడానికి నిర్ణయించుకున్నా ఇల్లు దాటి మేం బ్రతకలేం. మీలా పనీపాటా చెయ్యలేం - మమ్మల్ని పోషించుకోలేం. అందుకే ప్రతీవీ కర్మని సహిస్తూ పూజల్లో వుపవాసాల్లో శాంతిని వెతుక్కుంటూంటం"

కళ్ళు తుడుచుకుని మళ్ళీ అన్నపూర్ణమ్మగారి మొఖంలోకి చూసింది రాజమ్మ. నల్లగావున్న మొఖం ఏదో చెప్పింది. భయపడిందేదో ఆలోచనొచ్చి గతరాత్రి జరిగిన సంఘటనని మరోమారు నెమరేసుకుంది.

రాజశేఖరంగారి భోజనం ఎప్పుడూ మేడపైనే. ఆయన వూళ్ళో వున్నంతకాలం ఎన్నడూ ఒంటరిగాకూడా వుండరు. పైగా కూడావుండే అమ్మాయి కోరిన వంటల్ని చెయ్యమని భార్యకిచెప్పి చేయించడమేగాక ఆ అమ్మాయికి మరెవ్వరూ చెప్పకూడదనీ అగౌరవపరచరాదనీ హుకుంకూడా.

ఆయన మాటల్నెన్నడూ మీరలేదు అన్నపూర్ణమ్మ. ఆయన సుఖమే తన సుఖం అనుకుంది.

ఇదివరకు లూసీ తిన్న కంచాన్ని పని మనిషి కడిగేవేది. అన్నపూర్ణమ్మగారు

రాజశేఖరం కంచాన్ని తెప్పించి కడిగేది. మరి రాత్రేమయ్యిందో లూసీ ఏమందోగాని ఆమె తిన్న ఎంగిలికంచాన్ని భార్యనే కడగమని ఆయన పట్టు పట్టారు.

ఆమెఆత్మాభిమానం దెబ్బతింది. రోషం, దుఃఖం కట్టలుత్రెంచి ప్రవహించాయ్.

అయినా కంచాలు కడిగేసింది.

ఎన్నడూ లేనంత వుద్వేగంగా ఆందోళనగా వున్న ఆవిడ మొఖాన్నిచూచి రాజమ్మ భయపడింది. కాని పెదవి విప్పలేకపోయింది.

తెల్లవారేసరికి అంతా అయిపోయింది.

"ఆఖరికిలాటిచావు రాని పెట్టుందా తల్లీ నీకు! నువ్వుచేసిన పూజలూ వ్రతాలూ ఏ ఏట్లో కలిసిపోయాయో తల్లీ" అని రోదించింది రాజమ్మ.

శవాన్ని స్నానం చేయించి పట్టుబట్టలు కట్టి బొట్టూ పూజుపెట్టి పాడె ఎక్కించారు.

"ముత్తైదువగా వెళ్ళిపోతోంది - అదృష్టవంతురాలు!" "మహాపతివ్రతగనుకే భర్త చేతులమీదిగా దాటిపోతోంది." అని అంతా అనుకొంటోంటే పూలూ డబ్బులూ బక్కాలూ జిమ్ముతోంటే బ్యాండ్ మేళం విషాదంగా మ్రోగుతూ ముందు నడుస్తోంటే వూరు వూరంతా కదిలింది శవం వెంట.

ఇటువంటి శవయాత్ర తామెన్నడూ చూడలేదన్నారు తల నెరిసినవాళ్ళు.

"అన్నపూర్ణమ్మతల్లీ! నీ జన్మ పునీతమయ్యిందమ్మా" అనుకున్నారు చాలామంది.

కాని—

శ్మశానాన్నుంచి వస్తూనే పైమీది శాలువాని విసిరేసి మేడమీద గదిలోకెళ్ళి లూసీ వెచ్చని కౌగిట్లో ఒదిగిపోయి రాజశేఖరం గారు ఇహాన్నీ పరాన్నీ మరచిపోయారన్న సంగతి ఒక్క రాజమ్మకే తెలుసు. *


మీ కుటుంబంలోని యావన్మందినీ

ఆలోచింపచేసే

ప్రజాతంత్ర

ప్రతి వారం చదవండి